క్లుప్తంగా

మణిపూర్ అల్లర్లకు నిరసనగా క్రైస్తవుల ర్యాలీ


పెనుబల్లి: ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

వైరా/పెనుబల్లి: మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవులపై జరుగుతున్న దాడులకు నిరసనగా క్రైస్తవులు ఆదివారం వైరా, పెనుబల్లిలో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. వైరా రింగ్ రోడ్డు నుంచి పాత బస్టాండ్ వరకు, పెనుబల్లి ఆర్‌సీఎం చర్చి నుంచి రింగ్ సెంటర్‌వరకు ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, పెనుబల్లి ఆర్‌సీఎం చర్చి విచారణ గురువు అగస్టీన్ మాట్లాడుతూ.. ప్రభుత్వాలు తక్షణమే అల్లర్లకు అడ్డుకట్ట వేసి క్రైస్తవులను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమాలల్లో పాస్టర్లు ప్రేమ్ స్టీవెన్‌సన్, ఏలీషా, అజరయ్య, సుధాకర్, ఆమోస్, డేవిడ్, యోహాన్, ప్రభుదాస్, ఇజ్రాయేల్, కాంగ్రెస్ నాయకుడు దార్న శేఖర్, ఫణితి సైదులు, సంఘ పెద్దలు కొండా ఏసోబు, నల్లబెల్లి మరియ బాబు, సంఘస్తులు పాల్గొన్నారు.

ఏన్కూరులో ఎంపీ బాబూరావు దిష్టిబొమ్మ దహనం..

ఏన్కూరు: తెలంగాణలో కూడా మణిపూర్ లాంటి కుట్రలకు బీజేపీ తెరలేపుతుందని సేవాలాల్ సేన ఖమ్మం జిల్లా అధ్యక్షుడు బానోత్ శ్రీకాంత్ విమర్శించారు. తెలంగాణలో లంబాడీలను గిరిజనుల జాబితా నుంచి తొలగించాలని అదిలాబాద్ ఎంపీ సోయం బాబూరావు చేసిన వాఖ్యలను నిరశిస్తూ ఆదివారం ఏన్కూరులో లంబాడీలు బాబూరావు దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. కార్యక్రమంలో సేవాలాల్ సేన నాయకులు బానోత్ బాలాజీ, గుగులోత్ భవసింగ్, బోడరాజు, కొర్రా బాలాజీ, ఈశ్వర్, సర్దార్, బాలూ, నగేష్, కిషోర్, మంగీలాల్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైరా రిజర్వాయర్ వద్ద పర్యాటకుల సందడి


వైరా రిజర్వాయర్ అలుగు వద్ద యువకులు

వైరా: వైరా రిజర్వాయర్‌కు గత వారం రోజులుగా కురిసిన వానలకు భారీగా వరద వచ్చి రిజర్వాయర్ మత్తడి పోస్తుండడంతో పర్యాటకులు వైరా రిజర్వాయర్ అందాలను చూడటానికి తరలి వస్తున్నారు. ఆదివారం వైరా రిజర్వాయర్‌కు పర్యాటకులు భారీగా తరలి వస్తున్నారు. మత్తడి పోస్తున్న వైరా పెద్ద అలుగు వద్ద సందడి చేశారు. ప్రమాదకరంగా ఉన్నప్పటికీ యువతీ యువకులు అలుగు వద్దకు వెళ్లడానికి సాహసం చేసి మరీ ఉల్లాసంగా గడిపారు.

ఆర్థిక సాయం


బాధిత కుటుంబానికి నగదు అందిస్తున్న రామకృష్ణ

కల్లూరు: కురుస్తున్న వర్షాలకు కల్లూరు పట్టణం పుల్లయ్యబంజర్ రోడ్డులోని షేక్ దస్తగిరికి చెందిన పూరిల్లు గోడలు నాని పడిపోవడంతో స్పందించిన బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు పెడకంటి రామకృష్ణ ఎమ్మెల్యే సండ్ర సూచన మేరకు ఆదివారం రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండి.ఇస్మాయిల్, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు కమ్లి, కిరణ్‌కుమార్, జమలయ్య, నాగేశ్వరరావు, పాష, నయీమ్, మస్తాన్, జావిద్, మోయిన్ పాల్గొన్నారు.

మహాసభను జయప్రదం చేయండి


అభివాదం చేస్తున్న ఎమ్మార్పీఎస్ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ రాజన్నమాదిగ

సత్తుపల్లిరూరల్: హైద్రాబాద్‌లో ఆగస్టు రెండో వారంలో జరుగు విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని ప్రతి గ్రామం నుంచి అధిక సంఖ్యలో మాదిగలు తరలిరావాలని ఎంఎస్‌పీ జిల్లా ఇన్‌చార్జ్ యాతాకుల రాజన్నమాదిగ కోరారు. స్థానిక విశ్వశాంతి స్కూల్‌లో ఆదివారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ సత్తుపల్లి నియోజకవర్గ నాయకుల సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎంఎస్‌పీ జిల్లా ఇన్‌చార్జ్ యాతాకుల రాజన్న, నియోజకవర్గ ఇన్‌చార్జ్ పగిడికత్తుల ఈదన్నమాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కూరపాటి సునీల్‌మాదిగ హాజరయ్యారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు శ్రీను, లక్ష్మణ్, అర్జున్, అశోక్, రాంబాబు, ముత్తారావు, రవి, వెంకటేశ్వర్లు, కృష్ణ, సురేష్, యేసు, ప్రసాద్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అయినా తప్పదు కదా?!


రేకుల షెడ్డులో కొనసాగుతున్న సహకార సొసైటీ కార్యాలయం


శిథిలావస్థలో ఉన్న పశువైద్యశాల భవనం


శాఖా గ్రంథాలయ భవనం

శిథిల భవనాల్లోనే విధులు..
- పెచ్చులూడి వర్షాకాలంలో బిక్కుబిక్కుమంటున్న ఉద్యోగులు
- ముదిగొండలో పలు ప్రభుత్వ కార్యాలయాల పరిస్థితి ఇదీ..
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

ముదిగొండ: మండల కేంద్రంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల భవనాలు శిథిలావస్థకు చేరాయి. ఏళ్ల తరబడి ఇదే పరిస్థితి ఉండి.. ఏటా వర్షాకాలంలో కురవడం సర్వసాధారణమైపోయింది. ఆయా భవనాల కాల పరిమితి ఏనాడో తీరిపోయిందని స్వయంగా అధికారులే అంగీకరిస్తున్నారు. అయినప్పటికీ కనీస మరమ్మతులు చేయించక.. కొత్త నిర్మాణాలపై దృష్టి సారించకపోవడంతో చినుకు పడితే చాలు ఎప్పుడేం జరుగుతోందనన్న భయంతో ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితి నెలకొంది.

ఏయే కార్యాలయాలంటే...

ముదిగొండలోని పశు వైద్యశాల, శాఖ గ్రంథాలయం, సహకార సొసైటీ భవనం, ఆరోగ్య ఉపకేంద్ర భవనాలు శిథిలావస్థకు చేరాయి. ఆయా భవనాలు ఎప్పుడు కూలుతాయో కూడా తెలియని పరిస్థితి నెలకొనగా.. వర్షం వచ్చిందంటే చాలు కురుస్తూ రికార్డులు తడుస్తున్నాయని ఉద్యోగులు వాపోతున్నారు. ఇందులో సొసైటీ కార్యాలయం పూర్తి రేకుల షెడ్డులోనే కొనసాగుతోంది. పశువుల ఆస్పత్రి ఇరుకుగా ఉండడంతో దాణా, మందులు భద్రపర్చడం ఇతరత్రా కార్యకలాపాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇక తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల పైస్లాబ్ పెచ్చులూడి పడుతున్నాయి. నిత్యం ప్రజలు వచ్చివెళ్లే ఈ కార్యాలయాల్లో ప్రమాదకర పరిస్థితులు ఉండడంతో ఉద్యోగులు, సిబ్బంది భారంగా విధులు నిర్వర్తిస్తున్నారు. తహసీల్‌లోని సిబ్బంది, కంప్యూటర్ ఆపరేటర్లు ఉండే గదుల పైపెచ్చులూడి పడుతుండడంతో సిబ్బందిని రిజిస్ట్రార్ కార్యాలయంలోకి మార్చారు. నూతన భవనాల నిర్మాణం మాటేమో కానీ కనీసం కార్యాలయాలకు మరమ్మతులైనా చేయించాలని అటు ఉద్యోగులు, ఇటు ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం..



ప్రస్తుతం కార్యాలయంలో తాత్కాలిక మరమ్మతులు చేపట్టడానికి నిధులు మంజూరు కావాల్సి ఉంది. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. కార్యాలయంలో మరమ్మతులు చేపడితే ఉద్యోగులతోపాటు ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

– శిరీష, తహసీల్దార్

భవన నిర్మాణం చేపడితే బాగుండు..



దాదాపు 40 ఏళ్లుగా రేకుల షెడ్డులోనే విధులు నిర్వర్తిస్తున్నాం. సహకార సొసైటీకి భవనం నిర్మాణం చేపడితే బాగుంటుంది. నిధులు మంజూరైనా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో కార్యకలాపాల నిర్వహణకు ఇబ్బందిగా ఉంది.

– తుపాకుల యలగొండస్వామి, ఎల్‌ఎస్‌సీఎస్ చైర్మన్

ప్రభుత్వంపై పోరాటం చేస్తాం


రైల్వే అండర్ బ్రిడ్జి ప్రహరీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న భట్టివిక్రమార్క

చింతకాని: రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన పాదయాత్ర ద్వారా తాను గుర్తించిన సమస్యలను పరిష్కరించే వరకు ప్రభుత్వంపై పోరాటం చేస్తామని సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. చింతకానిలో మండల పరిషత్ కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మెకు సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క ఆదివారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. భారత ప్రభుత్వం చేసిన కార్మిక చట్టం ప్రకారం కార్మికుల న్యాయమైన కోరికలను తీర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ సందర్భంగా జీపీ కార్మికులు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని భట్టికి అందజేశారు. అనంతరం చింతకాని – అనంతసాగర్ గ్రామాల మధ్య నిర్మాణం పూర్తి చేసుకున్న రైల్వే అండర్ బ్రిడ్జి ప్రహరీ నిర్మాణ పనులను పరిశీలించిన భట్టి రైల్వే ఉన్నతాధికారులతో ఫోన్లో మాట్లాడారు. నాణ్యత లేకుండా నిర్మించిన బ్రిడ్జి నిర్మాణ పనులను చేపట్టిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు గోపి, మండల అధికార ప్రతినిధులు భాస్కర్, కిషోర్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు గోవిందరావు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగార్జున్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు అబ్దుల్ మజీద్, నాయకులు అప్పారావు, బాబురావు పాల్గొన్నారు.

విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేత


పెనుబల్లి: సౌమ్యశ్రీకి ల్యాప్‌టాప్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

పెనుబల్లి : జేఈఈ అడ్వాన్స్‌లో ర్యాంక్ సాధించి ఐఐటీలో సీటు సంపాదించిన విద్యార్థిని తడికమళ్ల సౌమ్యశ్రీని ఆదివారం ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అభినందించి ల్యాబ్‌టాప్‌ను బహుకరించారు. మండలంలోని మండాలపాడు గ్రామ సర్పంచ్ మంగమ్మ మనుమరాలు, తాతారావు, పద్మ దంపతుల కుమార్తె సౌమ్యశ్రీ జేఈఈ అడ్వాన్స్‌లో 992 ర్యాంక్ సాధించి, అస్సాం రాష్ట్రంలోని గోవతిలోని ఐఐటీలో ఈసీఈ విభాగంలో సీటు సాధించింది. దీంతో రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారధిరెడ్డి సహకారంతో విద్యార్థిని సౌమ్యశ్రీకి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య చేతుల మీదుగా ల్యాప్‌టాప్ అందజేసి అభినందించారు. భవిష్యత్‌లో బాగా చదువుకుని ఉన్నత స్థాయిలో నిలవాలని ఆశీర్వదించారు.

బీటెక్ విద్యార్థినికి..

కొణిజర్ల: మండలంలోని తనికెళ్లకు చెందిన ఎన్‌ఐటీ వరంగల్‌లో బీటెక్ చదువుతున్న భుక్యా అపర్ణకు తనికెళ్లకు చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు టీవీ చౌదరి కుమారుడు లెనిన్‌చౌదరి, ఎన్‌ఆర్‌ఐ ఫౌండేషన్ వెంకట్ జిల్లేళ్లమూడి ఆదివారం లాప్‌టాప్ బహుకరించారు. తనికెళ్ల సీపీఐ కార్యాలయంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు లేడిబోయిన గోపాలరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఖమ్మం ఎన్‌ఆర్‌ఐ ఫౌండేషన్ సెక్రటరీ బండి నాగేశ్వరరావు, కావూరి సునంద, పీవీరావు, గడల భాస్కరరావు, యాసా సత్యనారాయణ, పాపిట్ల ఏసు, కేవీరావు, గూడె పాపయ్య తదితరులు ఉన్నారు.

బీరప్ప దేవాలయానికి విరాళం

కల్లూరురూరల్: మండలంలోని నారాయణపురం బీరప్ప దేవాలయానికి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య రూ.25 వేలు విరాళం నిర్వాహకులకు అందజేశారు. దేవాలయ నిర్మాణంపై నిర్వాహకులు దేవర మల్లేష్, మయూరి రాంబాబు, శ్రీనివాసరావు సండ్రకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఉమామహేశ్వరావు, సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ కూసంపుడి మహేష్, సొసైటీ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం.. మహాదానం


వైరా: ఇందిరమ్మ కాలనీలో అన్నదానం చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

వైరా: వైరా గ్రేటర్ విజన్ లయన్స్‌క్లబ్ అధ్యక్షురాలు ఉండ్రు వరలక్ష్మి ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ డైరెక్టర్ లయన్ ఘట్టమనేని బాబూరావు జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదివారం వైరా ఇందిరమ్మ కాలనీ వాసులకు అన్నదానం చేశారు. గత 10 రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఇందిరమ్మ కాలనీ నీట మునిగింది. బాధితులకు అన్నదానం చేశారు. అనంతరం కాలనీలో హరిత హారంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పీడీజీ డాక్టర్ కాపా మురళీకృష్ణ, జీఎంటీ కోఆర్డినేటర్ డాక్టర్ ఉండ్రు శ్యాంబాబు, ఆర్‌సీ లగడపాటి ప్రభాకర్, శ్రీకాంత్, శ్రీధర్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో..

కల్లూరు: లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ డాక్టర్ ఘట్టమనేని బాబూరావు, సభ్యుడు గంగుల నారాయణరావుల పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం కల్లూరు లయన్స్‌క్లబ్ జోన్ చైర్మన్ చలువాది నగేష్ ఆధ్వర్యంలో 200 మంది రిక్షా కార్మికులు, ఆటో కార్మికులు, ప్రయాణికులకు అల్పాహారం అందజేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షులు దారా సురేష్, కోశాధికారి సత్యనారాయణ, ఇందోజు రమేష్, కిన్నెర ఆనందరావు, గుర్రం శ్రీనివాసరావు, రాయల నాగేశ్వరరావు, కొప్పరపు నరసింహారావు, బస్విరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

సత్తుపల్లి: విశ్రాంత ఉద్యోగుల పెండింగ్ సమస్యలను సోమవారం జరిగే మంత్రివర్గ సమావేశంలో పరిష్కరించాలని ఆ సంఘం అసోసియేట్ జిల్లా అధ్యక్షుడు వి.చెంచిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనంలో కేశవరెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించని పక్షంలో ఆగస్టు 9న హైద్రాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ధర్నాను నిర్వహించేందుకు సమాయత్తమౌతున్నామన్నారు. సంఘ ప్రధాన కార్యదర్శి బద్రుద్దీన్ మాట్లాడుతూ.. మంత్రివర్గ సమావేశంలో సరైన నిర్ణయాలు తీసుకోనట్లైతే విశ్రాంత ఉద్యగులు వేలాదిగా హైద్రాబాద్ ధర్నాలో పాల్గొనాలన్నారు. కేశవరెడ్డి మాట్లాడుతూ.. భవిష్యత్ ఉద్యమ కార్యాచరణను హైద్రాబాద్ ధర్నాలో ప్రకటిస్తామన్నారు. ఈ సమావేశంలో ఏఎస్ ప్రకాశరావు, కేశవరెడ్డి, మధుసూదన్ రాజు పాల్గొన్నారు.

పులిహోర పొట్లాల పంపిణీ

పెనుబల్లి : అభయాలయన్స్‌క్లబ్ ఫాస్ట్ డిస్టిక్ గవర్నర్ గట్టమనేని బాబురావు జన్మదినం సందర్భంగా వియంబంజర్ అభయాంజనేయ స్వామి దేవాలయం వద్ద 200ల మందికి పులిహోర పొట్లాలను అందజేసినట్లు క్లబ్ బాధ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వేముల నరసింహారావు, సభ్యులు నరసింహారావు, లక్ష్మీనారాయణ, కాంతయ్య, రాజేశ్వరరావు, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పరిశోధకుడికి డాక్టరేట్


డాక్టరేట్ అందుకున్న మస్తాన్‌వలి

సత్తుపల్లిరూరల్: మండలంలోని పెద్దపాకలగూడెం గ్రామానికి చెందిన పఠాన్ మస్తాన్‌వలి ప్రతిష్టాత్మక రాయలసీమ విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను అందుకున్నారు. 'తెలంగాణలోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బీఈడీ కళాశాలల్లో కంప్యూటర్, ఐసీటీ విద్యను అమలు చేయడం'అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. పరిశోధకుడు పఠాన్ మస్తాన్‌వలికి ప్రిన్సిపాల్‌గా, టీచర్ ఎడ్యుకేటర్‌గా, ఓ అకాడమీ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తించిన అనుభవం ఉంది. పేపర్‌బాయ్‌గా, సేల్స్‌మెన్‌గా పని చేస్తూ ప్రభుత్వ విద్యాలయాల్లో డిగ్రీ పూర్తి చేశాడు. పట్టువదలని విక్రమార్కుడిలా నిరంతరం శ్రమించి డాక్టరేట్ పొందిన మస్తాన్‌వలికు ప్రొఫెసర్లు, కుటుంబ సభ్యులు, పరిశోధకులు, స్నేహితులు, మిత్రులు అభినందనలు తెలిపారు.

'బాబు గాడి జాబు' షార్ట్ ఫిల్మ్ పూర్తి

మధిర: బాబు గాడి జాబు షార్ట్ ఫిల్మ్ పూర్తి అయినట్లు యువనటుడు, దర్శకుడు ఎఆర్ సమీర్ తెలిపారు. కథ డిమాండ్‌తో మరికొన్ని సన్నివేశాలను మధిరలో చిత్రీకరించి ఫిల్మ్‌ను పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలను జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని త్వరలోనే విడుదల చేయనున్నట్లు తెలిపారు.

పరిశుభ్రతకు తొలి ప్రాధాన్యత


పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ మహేష్, కమిషనర్ సుజాత

సత్తుపల్లిటౌన్: పట్టణంలో పరిసరాలు పరిశుభ్రతకు తొలి ప్రాధాన్యతనిస్తున్నామని మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ అన్నారు. ఆయన స్థానిక 13వ వార్డులో ఆదివారం కమిషనర్ సుజాత, కౌన్సిలర్ అద్దంకి అనీల్‌కుమార్‌తో కలిసి ప్రత్యేక పారిశుద్ధ్య పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా డ్రైనేజీలలో పూడికలు తీయించి, పిచ్చిమొక్కలు, చెత్తా చెదారాన్ని తొలగించారు. వీధిల్లో బ్లీచింగ్ చల్లించి దోమల నివారణకు ఫాగింగ్ చేయించారు. మట్టి రోడ్లలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా జేసీబీతో కాలువలు తీయించేలా చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ బాబురావు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారులకు అండగా ఉంటా..


వాకర్స్, క్రీడాకారులతో కలిసి క్రికెట్ ఆడుతున్న డాక్టర్ మట్టా దయానంద్

సత్తుపల్లి: భవిష్యత్‌తో కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు ప్రజలందరు ఆశీర్వదించాలని కాంగ్రెస్ జిల్లా నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ అన్నారు. ఆదివారం స్థానిక జేవీఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో దయానంద్ మార్నింగ్‌వాక్ చేస్తూ వాకర్స్, క్రీడాకారులకు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోను వివరించారు. అదేవిధంగా హోటల్స్, టిఫిన్ సెంటర్లు, ఆటో అడ్డాల వద్దకు వెళ్లి కాంగ్రెస్ పార్టీని బలపర్చాలని కోరారు. క్రీడాకారులకు తనవంతు సహకారం ఎల్లప్పుడు ఉంటుందన్నారు. వాకర్స్, క్రీడాకారులతో కలిసి కొద్దిసేపు క్రికెట్ ఆడి ఉత్సాహ పరిచారు. అనంతరం అపార్ట్‌మెంట్లలో స్థానికులను కలుసుకొని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలను పంపిణీ చేశారు. అనంతరం 'కదిలింది దయానంద్ రథయాత్ర' సీడీని ఆవిష్కరణ, కార్యక్రమంలో ఎండి కమల్‌పాషా, ఇమ్మినేని ప్రసాదరావు, శ్రీనివాసరావు, మౌలాన, రఫీ, రాకేష్, ఇమామ్, మురళీరెడ్డి, నాగేశ్వరరావు, ఫ్రక్రుద్దీన్, సాయిశ్రీనివాస్, చెన్నారావు, గణేష్, జీవన్, దిలీప్, రహీం, సందీప్, అజయ్, ప్రకాష్ పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పించాలి..

కల్లూరు రూరల్: పేరువంచలో నిర్మించిన 40 డబుల్ బెడ్‌రూంలకు సౌకర్యాలు కల్పించాలని జిల్లా కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ డిమాండ్ చేశారు. ఆదివారం పేరువంచలో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కనీస వసతులు లేక నివాసం ఉంటున్న లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు అప్పారావు, నారాయణ వరపు శ్రీనివాస్, భరత్, కిరణ్, మురళి,గోపరాజు, జీవన్‌రెడ్డి, రవీంద్ర, మెంతుల ఏసు తదితరులు పాల్గొన్నారు.

సోలార్ పనిముట్లు పంపిణీ


సోలార్ దీపాలు అందుకున్న గొత్తికోయలతో ఎస్సై రామారావు, గివ్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు

కారేపల్లి: మండలంలోని ఎర్రబోడు గ్రామానికి సమీపంలో ఉన్న అడవి ప్రాంతంలో ఊటవాగు వద్ద నివసిస్తున్న గొత్తికోయల జీవితాల్లో.. గివ్ స్వచ్ఛంద సంస్థ వెలుగులు నింపింది. ఏళ్లుగా చీకట్లో బతుకులు వెళ్లదీస్తున్న గొత్తికోయల పరిస్థితిని తెలుసుకున్న కారేపల్లి ఎస్సై పుష్పాల రామారావు గివ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సత్య రాపేల్లిను సంప్రదించగా.. సుమారు రూ.50 వేలు విలువ చేసే 26 సోలార్ దీపాలను గొత్తికోయలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గివ్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు పీవీ అరుణ్, రంగు శివ, పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ నష్టాలకు పాలకులే కారణం

సత్తుపల్లిటౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాల వల్లే దేశంలోనే అతిపెద్ద రవాణా సంస్థ ఆర్టీసీకి నష్టాలు వస్తున్నాయని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దండు ఆదినారాయణ ఆరోపించారు. సత్తుపల్లిలోని విశ్వశాంతి విద్యాలయంలో ఆదివారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో వివిధ పక్షాల నాయకులు గంటా శ్రీనివాసరావు, మధుసూదన్‌రాజు, శరత్, మౌలాన, పి.నాగేశ్వరరావు, నాయుడు వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, తిరుపతయ్య, రామారావు, రంగారావు, వెంకటేశ్వర్లు, నర్సింహారావు, ప్రభాకర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కారేపల్లి: పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాటోత్ కృష్ణ ఆరోపించారు. కారేపల్లి ఎంపీడీఓ కార్యలయం ముందు చేపట్టిన సమ్మె ఆదివారానికి 25వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా జీపీ కార్మికుల సమ్మెకు ఆయన సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌వీ రాకేష్, జీపీ వర్కర్ల సంఘం నాయకులు షేక్ హుస్సేన్, అజ్మీర హేమ్‌చంద్, కొమరయ్య, గౌతమ్, కోటి, మోహన్ రావు, సుక్కు, యాదగిరి, సూర్యం పాల్గొన్నారు.

అక్రమ రవాణాను అరికట్టాలి

వైరారూరల్: ప్రతి ఒక్కరూ మానవ అక్రమ రవాణాను అరికట్టాలని ఏఐడీ కైలాస్ సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్ కమ్యూనిటీ సోషల్ మోబిలేజర్ ఎక్కిరాల రామదాసు అన్నారు. మండలంలోని స్టేజీ పినపాక గ్రామంలో ఆదివారం నిర్వహించిన మానవ అక్రమ రవాణా సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆర్థిక ఇబ్బందులు, నిరక్షరాస్యతను అదునుగా చేసుకున్న కొంతమంది వ్యక్తులు మానవ అక్రమ రవాణే ధ్యేయంగా పనిచేస్తున్నారని తెలిపారు. విద్యార్థులు ఎదైన సమస్యలు తలెత్తినప్పుడు చైల్డ్ లైన్ 1098 లేదా 100 కు డయల్ చేసి సమాచారం అందించాలన్నారు.

కీసర సాయికి ఘన నివాళులు


సాయి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కల్లూరు: మండలంలోని పేరువంచ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు కీసర శ్రీనివాసరెడ్డి సోదరుని కుమారుడు కీసర సాయి (25) చిత్రపటం వద్ద ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ పూల, మాలలు వేసి ఘన నివాళులు అర్పించింది. మాజీ మంత్రి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు సంభాని చంద్రశేఖర్ కీసర సాయి కుటుంబాన్ని ఫోన్ ద్వారా పరామర్శించి సంతాపం తెలిపారు. నివాళులు అర్పించి వారిలో టీపీసీసీ సభ్యుడు బైరెడ్డి మనోహర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దుర్గాప్రసాద్, యూత్ అధ్యక్షుడు కొదమసింహం వంశీ, ఎంపీటీసీ, రాష్ట్ర ఎస్సీ సెల్ డీపీటీ కన్వీనర్ కిరణ్‌కుమార్, భాస్కర్‌రావు, బస్విరెడ్డి, లక్ష్మారెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పీరీల ఊరేగింపు

తల్లాడ: తల్లాడలో మొహర్రం సందర్భంగా చివరి సర్గత్‌గా ఆదివారం పీరీలను ఘనంగా ఊరేగించారు. ఈ సందర్భంగా స్థానిక పీరీల సావిడి నుంచి డీజే సౌండ్ సిస్టంతో నృత్యాలు చేసుకుంటూ భక్తి శ్రద్ధలతో స్థానిక పుర వీధుల్లో పీరీలను చేతపట్టుకొని ఊరేగించారు. పీరీలకు పూజలు చేసి స్థానికులు తమ మొక్కులు చెల్లించుకున్నారు.

రోడ్డుపై నాట్లు వేసి నిరసన


తిమ్మరావుపేటలో రోడ్డుపై నాటు వేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఏన్కూరు: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గుంటలు ఏర్పడ్డ రోడ్లపై టీపీసీసీ సభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యకర్తలు నాట్లు వేసి నిరసన తెలిపారు. మండలంలోని తూతుక్కలింగన్నపేట, బురదరాఘవాపురం, తిమ్మరావుపేట గ్రామాల్లో దెబ్బతిన్న రోడ్లను సందర్శించి వాహనదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బురదలో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు స్వర్ణ నరేందర్, ఎంపీటీసీ లచ్చిరామ్ నాయక్, వేముల కృష్ణప్రసాద్, గుర్రం రవి, నాగేశ్వరరావు, సోందుమియా, గోపి, వెంకట్, నరసింహారావు, వినోద్, అయోధ్య తదితరులు పాల్గొన్నారు.

వరదలు తగ్గే.. గుంతలు మిగిలే..


చిరుమర్రి వద్ద లోలెవల్ చప్టా వరదలకు కొట్టుకుపోయిన రోడ్డు

ముదిగొండ: మండలంలోని వరసగా కురిసిన వర్షాలకు వరదలు పోటెత్తి కాలువలు, చెరువులు నిండి చప్టాలపై రోడ్లు కొట్టుకుపోయాయి. దీంతో పెద్ద పెద్ద గుంతలు పడడంతో వాహనదారులకు ఇబ్బందికరంగా మారింది. రాత్రి వేళల్లో కిందపడి క్షతగాత్రులు అవుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రతీ ఏటా వర్షాలకు చప్టాల వద్ద రోడ్లు కొట్టుకుపోయి నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కూడా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఉన్నతాదికారులు స్పందించి కొట్టుకుపోయిన చప్టాల వద్ద మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.